స్ఫూర్తిప్రదాత వైఎస్సార్


జడ్చర్లలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు మరువలేనివని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబే దుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, సీనియర్ నాయకుడు చంద్రకుమార్‌గౌడ్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నచింతకుంటలో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం తిరగబడుదాం, తరిమికొడదాం కార్యక్రమం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని తీగలపల్లిలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకురాలు మరియమ్మ, జిల్లా నాయకులు శ్యాముల్, జగన్‌రెడ్డి, ఖాయూం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లరవి, రమేష్‌గౌడ్, ఆంజనేయులు, రఘు, రామకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి.సాధిక్, మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

జడ్చర్ల: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ కోఆర్డినేటర్ మరియమ్మ, శామ్యూల్, హైదర్‌అలీ, ఆశన్న, శశిధర్, నవీన్, భాను తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలో వివిధ పార్టీల నాయకులు నివాళి అర్పించారు. జి.రవీందర్, విద్యాసాగర్, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు నివాళి అర్పించారు. శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, బాలచందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నారు.


జిల్లాకేంద్రంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

దేవరకద్ర: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల నాయకులు నివాళి అర్పించారు.

గండీడ్: వెన్నాచేడ్, పగిడ్యాల్, గండీడ్ గ్రామాల్లో వైఎస్సార్‌కు నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గండీడ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జితేందర్‌రెడ్డి, మండల లీగల్ సెల్ అడ్వయిజర్ పుల్లారెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచ్ ఊశన్న తదితరులు పాల్గొన్నారు.


భూత్పూర్ చౌరస్తాలో..


చిన్నచింతకుంటలో నివాళి అర్పిస్తున్న నాయకులు


కోయిల్‌కొండలో..


అడ్డాకులలో...


రుక్కంపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఓటుకు పోటెత్తాలని..

అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం

జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలు
పురుషులు : 3,30,827
మహిళలు : 3,29,327
ట్రాన్స్‌జెండర్ : 17

మహబూబ్‌నగర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధమవుతోంది. ఓటుహక్కుపై అవగాహన కల్పించడంతో పాటు నమోదు, తప్పుల సవరణ తదితర చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో 18 ఏళ్లు నిండినా, వచ్చే అక్టోబర్ 1 నాటికి నిండబోతున్న వారికి ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఓటర్ల తుది జాబితాను అక్టోబర్ 4న ప్రకటించనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈనెల 19లోపు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకు కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఓలను అందుబాటులో ఉంచింది. రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 831 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు దరఖాస్తులు తీసుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు శిబిరాలను పరిశీలించారు. ఆదివారం కూడా కార్యక్రమం ప్రత్యేక శిబిరం కొనసాగనుంది. బీఎల్ఓలు అందుబాటులో ఉండి నూతన ఓటు నమోదు, సవరణ వంటి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కాగా దరఖాస్తు కోసం ఆధార్, పదో తరగతి మార్కుల మెమో, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.


బ్రాహ్మణవాడీలో ఓటు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగార్జున

ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ..

నవాబుపేట: ఓటర్ల జాబితాపై బీఎల్ఓలు నిర్లక్ష్యం వహించరాదని అదనపు కలెక్టర్ మధన్‌మోహన్ రావు సూచించారు. శనివారం మండల పరిధిలో వివిధ గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్‌ను పరిశీలించారు.

రాజాపూర్: మండల తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తిర్మలాపూర్‌లో బీఎల్ఓలకు ఓటరు నమోదు కిట్లను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ భరత్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

దేవరకద్ర: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ ఆంజనేయులు, ఎన్నికల డీటీ రహమాన్‌లు తనిఖీ చేశారు.

మిడ్జిల్: కొత్తపల్లి, లింబ్యా తండాల్లోని కేంద్రాలను తహసీల్దార్ రాజునాయక్ పరిశీలించారు. ఆర్ఐ రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్: తహసీల్దార్ యేసయ్య మండలంలోని వివిధ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ యాదయ్య ఉన్నారు.

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా...

	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
మహబూబ్‌నగర్	1,17,519	1,17,155	11	2,34,685
జడ్చర్ల	1,03,936	1,02,123	5	2,06,064
దేవరకద్ర	1,09,372	1,10,049	1	2,19,422

క్లుప్తంగా

స్ఫూర్తి పురస్కారం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు జి.పాండురంగం స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో శనివారం భారత్ వికాస్ పరిషత్ 60వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీవీపీ జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

రాజాపూర్: బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాజాపూర్ గౌడ కులస్తులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాగా మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఆయన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఏఎంసీ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా కాంగ్రెస్ కమిటీలు

కోయిల్‌కొండ: మండలంలోని వింజామూర్, ఎల్దీప్‌తండా, హనుమాన్‌గడ్డతండా, కాస్గుబండతండా, ఉబ్బడితండా, ఎల్లారెడ్డిపల్లి, రామన్నపల్లితండా, సంగనోనిపల్లి గ్రామాల్లో ఏకగ్రీవంగా కాంగ్రెస్ కమిటీలను నియమించినట్లు మండల నాయకులు జి.రవీందర్, వై.విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు పార్టీల చేరినట్లు వివరించారు. సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామునాయక్, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన ఆకుల మైబు, ఆకుల చెన్నమ్మల మనవరాలు వివాహానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పుస్తె, మెట్టెలను శనివారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి తనవంతుగా సాయం చేశానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రెగ్యులర్ చేయాలి

పాలమూరు: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఏఐటీయూసీ నాయకుడు రాంమోహన్ డిమాండ్ చేశారు. శనివారం టీటీడీ కల్యాణ మండపం వద్ద దీక్ష నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

మిడ్జిల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు పాటిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. శనివారం వాడ్యాల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, జంగయ్య, సామెల్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పాలమూరు: సినీ హీరో పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు శనివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ హాజరై శిబిరం ప్రారంభించారు. దాదాపు 80యూనిట్ల రక్త సేకరణ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రాఘవేందర్, శ్రీనివాసులు, చారి, నరసింహ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వేయాలి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట ప్రకారం 15వేలతో మెగా డీఎస్సీని వేయాలని పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలె హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. 5089 పోస్టులను భర్తీ చేస్తామనడం దారుణమన్నారు. ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు హరీశ్వర్‌రెడ్డి, తీవారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వద్ద చేపట్టిన దీక్షలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫహద్, మండల అధ్యక్షుడు సాయితేజగౌడ్ సభ్యులు పాల్గొన్నారు.

కురుమూర్తిలో భక్తుల సందడి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: శ్రావణ శనివారం పురస్కరించుకొని కురుమూర్తి స్వామి దర్శనానికి ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామివారికి సమర్పించారు. కొందరు భక్తులు గండ దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాజగోపురం వద్ద దీపాలు వెలిగించారు.

దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదు : కలెక్టర్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రవి నాయక్, ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో ఫారాల పరిశీలనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఓటరు కార్డుల ముద్రణ తదితర అంశాల పై సమీక్షించారు. అలాగే రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ టర్న్ అవుట్ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, నూతన ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో లింగ నిష్పత్తి, జనాభా ఓటర్ల నిష్పత్తి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కలెక్టర్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్నికల ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త ఓటరు నమోదు, జాబితాలో సవరణలకై వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ఆధారంగా చనిపోయిన, డబుల్ ఓటర్లను గుర్తించాలన్నారు. మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగానే చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 18 సంవత్సరాలు ఉన్న వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదై ఉండాలని, ఒక వేళ లేనట్లయితే ఎందుకు నమోదు కాలేదో విశ్లేషణ చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఓటరు జాబితాలో లింగ నిష్పత్తి, థర్డ్ జెండర్ వంటివి పరిశీలించాలన్నారు. ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల ముద్రణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు పై దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి..

భూత్పూర్: సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం అన్నాసాగర్‌లోని ఆయన స్వగృహంలో వివిధ గ్రామాలకు చెందిన 170 మందికి పైగా పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ నాయకులు తదితరులు ఉన్నారు.



సత్తాచాటిన విద్యార్థులు



రాజాపూర్: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్(మండలస్థాయి) పోటీల్లో రాజాపూర్ కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటారు. కబడ్డీలో మొదటి బహుమతి సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఉన్న పాఠశాల హెచ్ఎం ఆనంద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ పావని, ఫిజికల్ డైరెక్టర్‌లు రాధిక, వడ్డన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై చికిత్స పొందుతూ వ్యక్తిమృతి

హన్వాడ: మండల పరిదిలోని శేక్‌పల్లి గ్రామం రెవెన్యూ శివారులోని కొత్తతండాలో ఓవ్యక్తి పాము కాటుకు గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు ... కొత్తతండాకు చెందిన విస్లావత్ సోమ్యానాయక్(50) గత శుక్రవారం తండా శివారులోని తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. జొన్న పంటలో కలుపుతీస్తున్న క్రమంలో పాముకాటుకు గురై ఇంటికి పరుగులు తీశాడు. గుర్తించిన కుటుంబీకులు బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆయన భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు.

4న నిరాహార దీక్ష

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌చారీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రవి నాయక్‌కు అందజేయనున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా స్వర్ణకారులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మట్టి సేకరణ



జడ్చర్ల టౌన్: మేరా మిట్టి మేరా దేశ్‌లో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు వెంకటేశ్వరకాలనీలోని అమరుడైన జవాన్ ఇంటి నుంచి నాయకులు మట్టి సేకరించారు. అసెంబ్లీ ఇన్‌చార్జ్ మధుసూదన్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముచ్చర్ల కృష్ణయ్య, కౌన్సిలర్ కుమ్మరి రాజు, నాయకులు పాల్గొన్నారు.

గండీడ్: జంగంరెడ్డిపల్లి, గండీడ్ గ్రామాల్లో నాయకులు మట్టి సేకరణ ప్రారంభించారు. రాష్ట్ర నాయకుడు ఏపీ రాములు, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్, కార్యదర్శి నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో 352వ ఆరాధనోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిత్యపూజలు చేసి రథోత్సవం జరిపించారు. రథోత్సవం పురస్కరించుకుని భక్తులు భజనలు చేస్తూ రాఘవేంద్ర స్వామి కీర్తనలు ఆలపిస్తు ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు బాలకృష్ణాచార్యులు, రాఘవేంద్రాచార్యులు, భక్తులు మంచన విఠలయ్య, శంకర్‌బాబు, అయ్యన్న బుచ్చిలింగం, గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

- కండక్టర్ పరిస్థితి విషమం

జడ్చర్ల: మండలపరిధిలోని బూర్గుపల్లి గేటు సమీపంలో శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ టిప్పర్ ఢీకొట్టింది. ఘటనలో ఆర్టీసీ బస్సు కండక్టర్ ఖయ్యూమ్(48) తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బూర్గుపల్లి గేటు సమీపంలో సాంకేతిక కారణాలతో మరమ్మతుకు గురై ఆగిపోయింది. ఈ క్రమంలో కొద్ది సేపటి తరువాత నాగర్‌కర్నూల్ వైపు వెళ్లేందుకు వచ్చిన మరో బస్సును దాని వెనుకే నిలిపి ప్రయాణీకులను అందులోకి ఎక్కించారు. ఈ క్రమంలో బస్సు వెనుకే కండక్టర్ నిలిచి ఉన్నాడు. అదే సమయంలో జడ్చర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ముందు నిలిపిన బస్సును ఢీకొంది. దీంతో వెనుకాలే నిలిచి ఉన్న కండక్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడి పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనలో బస్సులోని ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు

జడ్చర్ల టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కావేరమ్మపేటలో నిర్మించిన 120 డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని వివరించారు. ఇల్లు లేని నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎంపికైన వారికి వచ్చేవారం సరిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే సమక్షంలో శనివారం కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.


లక్కీడ్రా తీస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పథకాలను వినియోగించుకోవాలి


మహబూబ్‌నగర్‌లో గొర్రెలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పశుసంపద పెరిగిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వీరన్నపేట యాదవ కమ్యూనిటీ భవనంలో గొర్రెలను పంపిణీ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కుల వృత్తులకు గౌరవాన్ని తీసుకు వచ్చామని, అన్ని కులాల వారి అభివృద్ధికి కృషిచేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన గొర్రెలను ఎట్టి పరిస్థితిలో అమ్ముకోవద్దని కోరారు. మహబూబ్‌నగర్‌లో యాదవ కమ్యూనిటీ భవనం కోసం ఎకరం స్థలంతో పాటు రూ. 2 కోట్లను త్వరలోనే ఇవ్వనున్నామని, 20 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని భవనాన్ని అందంగా నిర్మించుకోవాలని సూచించారు. అలాగే హన్వాడ మండలంలో సైతం యాదవ కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతయ్యయాదవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, ముడా డైరెక్టర్ సాయిలుయాదవ్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి శనివారం మండల పరిధిలోని మొకర్లాబాద్‌లో గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గొర్రెలను పంపిణీ చేశారు. పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రక్షిత, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాలను పెంచుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏటీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఖోఖో సెలక్షన్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మండలస్థాయిలో గెలుపొందిన జట్లను జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తెలిపారు.


మొకర్లాబాద్‌లో గొర్రెలను పంపిణీ చేస్తున్న పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండీడ్: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి జక్లపల్లి, రుసుంపల్లి గ్రామాల్లో శనివారం గొల్ల కురుమలకు గొర్రెలను పంపిణీ చేశారు. పెద్దవార్వాల్‌లో హైమాస్టులైట్లను, గట్టు చెన్నరాయుని ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.

వర్షాలు కురవాలని అఖండ భజన


కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వర్షాలు కురువాలని శనివారం బోయపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో భజన మండలి ఆధ్వర్యంలో 24 గంటల అఖండభజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుచ్చారెడ్డి, రాములు, నాగిరెడ్డి, భజన మండలి సభ్యులు రాంచంద్రయ్య, సంజీవయ్య, కుమార్, సత్యం, నర్సిములు, కృష్ణయ్య, భగవాన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా అనంతరెడ్డి

గండీడ్: రెడ్డిపల్లికి చెందిన పల్లె అనంతరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించింది. ఆయన కుల్కచర్ల మండలంలో దాదాపు 10 ఏళ్లు పనిచేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ కొండాపూర్ పాఠశాలకు హెచ్ఎంగా వెళ్లారు. ప్రస్తుతం అక్కడే పనిచేస్తున్నారు. ఆయనను ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించడంపై మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.